నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, గురువారం 25 జూలై 2024 | YADADRI BHUVANAGIRI

## రోశయ్య లెక్కనే రేవంత్ ఆఫర్

- ఎర ఏదో ఇనాం ఏదో తెల్వదా..?
- సోషల్ మీడియాలో మాజీ డీఎస్పీ నళిని పోస్ట్

యాదాద్రి భువనగిరి, జూలై 24 : మాజీ సీఎం రోశయ్య ఆఫర్‌తో నాడు పెద్ద ఫూల్ అయ్యానని, చుక్కలు చూపించారని, ఆయన లెక్కనే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఆఫర్ ఇచ్చారని మాజీ డీఎస్పీ నళిని విమర్శించారు. బుధవారం ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'అప్పటి సీఎం రోశయ్య ఆఫర్ ఇయ్యగానే మావోళ్లు లక్క గృహాలకు పొమ్మని నెట్టేసింఁడ్రు. పెద్ద ఫూల్‌ను అయ్యా. సుక్కలు సూపెట్టింఁడ్రు. భాగమతిలాగా ఎట్టనో గట్ల తప్పించుకు బయటపడ్డ. అదే పార్టీకి చెందిన ఇప్పటి సీఎం కూడా సేమ్ టూ సేమ్ గట్లనే ఆఫర్ ఇచ్చిండు. ఎర ఏదో..? ఇనాం ఏదో తెలువదా?' అని దుయ్యబట్టారు. జీతం కోసం తల తాకట్టు పెట్టుకోవాల్సిన ఖర్మ ఇప్పుడు తనకేంటి అని అన్నారు. వేదం చదువుడు ఆపేసిపోతే, వాళ్లిచ్చే మెమోలకు ఎక్స్‌ప్లనేషన్స్ రాసుడే సరిపోతుందని, జీవితం అంతా ఏడుపుతో తెల్లారిపోతదని తెలిపారు.

## నేటి నుంచి మూసీ కాల్వలకు నీటి విడుదల



కేతేపల్లి, జూలై 24 : వానకాలం సీజన్‌లో పంటల సాగు కోసం మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు గురువారం నుంచి నీటిని విడుదల చేయనున్నారు. నాలుగు తడులు విడుదలకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మొదటి విడుతగా 25 రోజులపాటు నీటిని విడుదల చేయనున్నట్లు డీఈఈ చంద్రశేఖర్ తెలిపారు. ప్రాజెక్టు కుడి కాల్వకు స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు చెప్పారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 641.60 అడుగులు (3.59 టీఎంసీలు) ఉన్నది. ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులోకి 1,467 క్యూసెక్కులు వస్తున్నది. 68.74 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో దిగువకు వెళ్తున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండకపోయినప్పటికీ ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో ఆధారంగా, రైతుల ప్రయోజనం కోసం ముందుగానే నీటిని వదులుతున్నారు. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది.

## అభిమాన నాయకుడికి శుభాకాంక్షల వెల్లువ

**ఘనంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు**

- జిల్లా వ్యాప్తంగా కేకులు కట్ చేసిన బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు
- ఆస్పత్రులు, అనాథ ఆశ్రమాల్లో పండ్ల పంపిణీ



హైదరాబాద్‌లోని అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

యాదాద్రి భువనగిరి, జూలై 23 (నమస్తే తెలంగాణ) : మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. అన్ని మండలాలు, గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేకులు కట్ చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఆస్పత్రులు, అనాథాశ్రమాల్లో పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసి మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి బర్త్‌డే శుభాకాంక్షలు తెలియజేశారు. భువనగిరి పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్, పార్టీ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, ఇతర నేతలు కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు అందించారు. ఆలేరులో జరిగిన వేడుకల్లోనూ మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్య గౌడ్ పాల్గొన్నారు. కేటీఆర్ జన్మదినం సందర్భంగా యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బీఆర్‌ఎస్ యాదగిరిగుట్ట కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



యాదగిరిగుట్ట పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ యాదగిరిగుట్ట మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య.



భువనగిరిలోని జిల్లా కేంద్ర దవాఖానలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

## ప్రొటెం స్పీకర్‌గా బాలూనాయక్



చందంపేట, జూలై 24 : దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ బుధవారం జరిగిన అసెంబ్లీ శాసన సభ సమావేశాల్లో ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించారు. లంబాడ సామాజిక వర్గానికి చెందిన బాలూనాయక్ ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## వరద ఉధృతిని ఎప్పటికప్పుడు పరిశీలించాలి

- కలెక్టర్ హనుమంత్ కె. జెండగే



రుద్రవెల్లి మూసీ వంతెన వద్ద అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ హనుమంత్ కె.జెండగే

బీబీనగర్, జూలై 24 : మండలంలోని రుద్రవెల్లి మూసీ వంతెనను కలెక్టర్ హనుమంత్ కె.జెండగే బుధవారం వరద ప్రవాహ ఉధృతిని ఎప్పటికప్పుడు గమనించాలని, నీటి ప్రవాహం పెరిగితే వాహనాలు, వ్యక్తుల రాకపోకలు జరుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. బారికేడ్లు, ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయాలని, 24 గంటలు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రెడ్డి, తాసీల్దార్ శ్రీధర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కృష్ణా వెనుక జలాల్లో సాయంత్రం 5 గంటల వరకే అనుమతి

చందంపేట, జూలై 24 : నేరేడుగొమ్ము మండలం వైజాక్ కాలనీ సమీపంలోని కృష్ణా వెనుక జలాల్లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకే పర్యాటకులకు అనుమతి ఉందని నేరేడుగొమ్ము ఎస్ఐ సతీశ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కృష్ణా వెనుక జలాల్లో స్నానానికి వెళ్లి ఐదుగురు మృత్యువాతపడిన నేపథ్యంలో పర్యాటకులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కృష్ణా వెనుక జలాల్లో ఈతకు వెళ్లడం, స్నానం చేయకూడదని తెలిపారు. సాయంత్రం 5 గంటల తర్వాత కృష్ణా వెనుక జలాల్లో సంచరిస్తే పోలీసు శాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరపడవలు నడిపే వారు పోలీసుల నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో చట్టరీత్యా చర్యలకు బాధ్యులవుతారని పేర్కొన్నారు. కృష్ణా వెనుక జలాల్లో అనుమతులు అతిక్రమించి సంచరిస్తే 8712670224 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

- జడ్పీ సీఈఓ శోభారాణి



బొమ్మలరామారం, జిల్లా పరిషత్ పాఠశాలలో అడ్మిషన్స్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ శోభారాణి

బొమ్మలరామారం, జూలై 24 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జడ్పీ సీఈఓ శోభారాణి అన్నారు. పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల క్రీడా పోటీలను ప్రారంభించారు. పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్, ఎంపీఓ మాలిని, జీహెచ్ఎం వరలక్ష్మి, పీడీ నర్సింహ, పంచాయతీ కార్యదర్శి పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రుణమాఫీపై నోరు విప్పరే..

**ఏ సమాచారమూ ఇవ్వని అధికారులు**

- అర్హులు, లబ్ధిదారుల వివరాలు లేవంటూ ప్రశ్నల దాటవేత
- ఒకరికి మీదికి ఒకరు తోసేస్తున్న బ్యాంకర్లు, వ్యవసాయాధికారులు
- తమకు రుణమాఫీ ఎందుకు అవ్వలేదో చెప్పాలంటున్న బాధితులు



నల్లగొండలోని ఓ బ్యాంక్‌లో ఖాతాలను చెక్ చేసుకుంటున్న రైతులు

సూర్యాపేట, జూలై 24 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల ముందు రూ.2లక్షల రుణమాఫీకి హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కొర్రీల మీద కొర్రీలు పెడుతూ అన్నదాతలను అవస్థల పాల్జేస్తున్నది. రుణమాఫీ అవ్వని రైతులు తమకు ఎందుకు ప్రభుత్వం లబ్ధి చేకూరలేదో తెలియక ఆగమాగం అవుతున్నారు. నిత్యం వ్యవసాయాధికారుల దగ్గరికి, బ్యాంకుల చుట్టూ విసిగి వేసారుతున్నారు. ఏ అధికారిని అడిగినా సరైన సమాధానం రాకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తొలి విడుత లక్షలోపు మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. వాస్తవానికి జిల్లాలో 56,217 మంది రైతులకు 282.98 కోట్లు మాఫీ అయినట్లు చెప్తున్నప్పటికీ ఆస్థాయిలో మాఫీ అయ్యిందా, లేదా అన్నది కూడా ప్రశ్నార్థకంగా మారింది. అసలు లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతులు ఎంతమంది ఉన్నారు, ఎంతమందికి మాఫీ అయింది అనే సమాచారం ఎక్కడా లభించడం లేదు. రైతులతో పాటు మీడియా ప్రతినిధులు అడిగినా బ్యాంకర్లు గానీ, వ్యవసాయ శాఖ అధికారులు గానీ సమాధానం ఇవ్వడం లేదు. బ్యాంకర్లు తమకు తమకు సంబంధం లేదు.. వ్యవసాయ శాఖ వద్దే ఆ వివరాలు ఉంటాయని చెప్తుండగా, వ్యవసాయ శాఖ అధికారులు బ్యాంకర్ల మీదకి నెట్టివేస్తున్నారు. రైతాంగానికి సంబంధించిన రుణమాఫీ విషయంలో ఇంత గుట్టుగా ఉండాల్సిన అవసరమేంటో అధికారులు, ప్రభుత్వానికే తెలియాలి. కేసీఆర్ సర్కారులో నాడు లక్షలోపు రుణమాఫీ చేయగా సూర్యాపే జిల్లాలో మొత్తం 1,75,000 మంది రైతులు 1,300 కోట్ల రూపాయల రుణాలు తీసుకున్నట్లు గుర్తించారు. వారిలో దాదాపు లక్ష మంది రైతులకు రుణాలు మాఫీ చేయగా, ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 2 లక్షలు మాఫీ చేయాల్సి ఉండగా.. తొలి విడుతగా లక్ష లోపు చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. కాగా, వారం క్రితం ఈ ప్రక్రియ మొదలు కాగా, జిల్లాలో 2.53 లక్షల మంది రైతులు సుమారు 3,350 కోట్ల రుణాలు తీసుకున్నట్లు గుర్తించారు. ఇందులో 2 లక్షల రూపాయల లోపు తీసుకున్న వారే 90 శాతం మంది ఉన్నట్లు తెలుస్తున్నది. 1.60 లక్షలకు పైన రుణాలు తీసుకోవాలంటే నిబంధనల మేరకు షూరిటీలు ఇవ్వాల్సి ఉండడంతోపాటు వడ్డీ రేటు కూడా మారుతుందని, అందుకే రెండు లక్షలు దాటి రుణాలు తీసుకున్న రైతుల సంఖ్య వేళ్ల మీద లెక్కబెట్టేంతే ఉంటుందని ఓ బ్యాంకు అధికారి తెలిపారు. ఈ లెక్కన జిల్లాలో సుమారు 2.35లక్షల మంది రైతులు రెండు లక్షలలోపు రుణాలు తీసుకొని ఉంటారని, అంతా కలిపి 3వేల కోట్ల వరకు ఉండొచ్చన్న అంచనాగా చెప్పుకొచ్చారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష లోపు రుణాలు మాఫీ చేసిన సమయంలో 1.75 లక్షల మంది రైతులకు 1,300 కోట్లు ఉండగా, ఇప్పుడు కూడా అంతే మొత్తంలో రుణాలు ఉంటాయన్నది తెలిసిన సమాచారం. తీరా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన లక్షలోపు రుణమాఫీలో సూర్యాపేట జిల్లాలో కేవలం 56,217 మంది రైతులకు 282.98 కోట్లు మాఫీ చేయడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. ఎన్నికల ముందు ఎవరైనా రుణాలు తీసుకోకుంటే వెంటనే బ్యాంకులకు వెళ్లి రెండు లక్షలు తీసుకోండి.. మేం వచ్చి మాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ నేడు అనేక కొర్రీలు పెట్టడం పట్ల రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అప్పులు తీసుకున్న ప్రతి రైతుకూ బ్యాంకులో అకౌంట్ ఉంది. ఆధార్ కార్డులు అనుసంధానం అయ్యింది. అయినా ఏదో ఒక కొర్రీ పెట్టి రుణమాఫీ చేయడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీ కాని వేలాది మంది రైతు ఐదు రోజులుగా బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రుణమాఫీపై కచ్చితమైన సమాచారాన్ని బహిర్గతం చేసి, మాఫీ కాని రైతులకు సరైన కారణం చెప్పాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

### ఏకకాలంలో రుణమాఫీ ఎటుపోయింది



ఎన్నికలకు ముందు రైతులకు ఏకకాలంలో రూ.2లక్షలు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు అధికారంలోకి రాగానే పట్టించుకోవడం లేదు. ఏకకాలంలో రుణమాఫీ ఎటుపోయిందో రేవంత్‌రెడ్డి సర్కారు రైతులకు సమాధానం చెప్పాలి. కేవలం ఓట్ల కోసమే కాంగ్రెస్ పార్టీ నాటకాలు ఆడింది. రైతులను ఇబ్బంది పెట్టడం మంచిది కాదు. ఇప్పటికైనా కండ్లు తెరిచి వెంటనే రూ.2లక్షలు రుణమాఫీ చేయాలి.

-నర్ర పరమేశ్, రైతు, సోలిపేట

## మత్తడి దుంకుతున్న పోచంపల్లి పెద్ద చెరువు



హైదరాబాద్‌లో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. మూసీ వాగు నుంచి నీరు వచ్చి చేరడంతో పోచంపల్లి పెద్ద చెరువు పూర్తిస్థాయిలో నిండి మత్తడి దుంకుతున్నది. దాంతో చెరువు ఆయకట్టు ప్రాంతాల్లో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

– భూదాన్‌పోచంపల్లి, జూలై 24



## యాదగిరి గుట్టలో 25 మంది ఉద్యోగుల బదిలీకి రంగం సిద్ధం!

- నాలుగేండ్లకు పైగా సర్వీస్ పూర్తయిన వారు 61 మంది
- దేవాదాయ శాఖకు గుట్ట ఈఓ నివేదిక

యాదగిరిగుట్ట, జూలై 24 : యాదగిరిగుట్ట దేవస్థానంలో నాలుగేండ్ల కంటే ఎక్కువ సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తున్న 61 మంది ఉద్యోగస్తుల్లో 25 మంది మాత్రమే బదిలీ కానున్నారు. మినిస్టీరియల్ ఉద్యోగస్తుల్లో 40 శాతం మందిని బదిలీ చేయాలని రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయగా ఉద్యోగ బదిలీలకు సంబంధించిన పూర్తి వివరాలను కమిషనర్‌కు యాదగిరిగుట్ట దేవస్థానం అందజేసింది. ఇందులో ఎవరెవరు బదిలీపై వెళ్తారో ఈ నెల 27న స్పష్టమవుతుందని ఆలయ ఈఓ భాస్కర్ రావు తెలిపారు. 61 మంది నాలుగేళ్ల కంటే ఎక్కువ కాలం దేవస్థానంలో పనిచేస్తున్నారు. వీరిలో డీఈఓ, ఈఈ, ఎలక్ట్రికల్ ఈఈ, ఏఈ, సివిల్ ఈఈ మినహా ఇద్దరు ఏఈలు, ఆరుగురు సూపరింటెండెంట్లు, ఏడుగురు సీనియర్ అసిస్టెంట్లు, 9 మంది జూనియర్ అసిస్టెంట్లు, సివిల్ విభాగం ఏఈ కలిసి మొత్తం 25 మంది ఉన్నారు. వీరు బదిలీపై వెళ్లనున్నారు. వీరందరూ ఆర్‌జేసీ పరిధిలోని దేవస్థానాలైన యాదగిరిగుట్టతోపాటు వేములవాడ, భద్రాచలం, డీసీ క్యాడర్ పరిధిలోఉన్న కొమురవెల్లి, కొండగట్టు, బాసర దేవాలయాలకు బదిలీపై వెళ్లాల్సి ఉంటుంది. ఇందులో ఏ ఉద్యోగి బదిలీపై ఏ దేవస్థానానికి వెళ్తారో వచ్చే శనివారం దేవాదాయ ధర్మదాయశాఖ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి తుది నివేదిక వెల్లడించనున్నట్లు ఈఓ తెలిపారు. యాదగిరిగుట్ట దేవస్థానంలో 5 మంది ఏఈఓలలో ఏడాదిలోపు పదోన్నతి పొందే ఉద్యోగి రాంమోహన్‌రావు, దేవస్థాన ఉద్యోగ సంఘం నాయకుడైన గజవెల్లి రమేశ్ బాబు ఆఫీస్ బేరర్ కింద పరిగణలోకి తీసుకుని వీరిద్దరికి బదిలీపై మినహాయింపు ఉంటుందని ఆలయ ఉద్యోగులు భావిస్తున్నారు. ఇక మిగతా ముగ్గురు ఏఈఓలైన జూశెట్టి కృష్ణ, గట్టు శ్రవణ్‌కుమర్, గజవెల్లి రఘులో ఇద్దరు ఏఈఓల బదిలీ ఖాయంగానే కనిపిస్తున్నది. దీంతో పాటు ఉద్యోగులు, కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితితోపాటు పలు అంశాలలో బదిలీలను నిలిపివేసే అవకాశం ఉందని అధికార వర్గాల వెల్లడించాయి. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను రుజువు చేస్తూ బదిలీలను నిలిపివేసే అవకాశం కూడా లేకపోలేదు. ఇదిలా ఉంటే తమ బదిలీలను నిలిపివేయాలని దేవస్థాన ఉద్యోగులు పైరవీలు ప్రారంభించారు. ఇటీవల ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యను కలిసి వినతి పత్రం కూడా అందజేశారు. 25 మంది ఉద్యోగస్తుల బదిలీలుంటాయా? లేక అనారోగ్యంతోపాటు వివిధ కారణాలు చూపుతూ నిలిపివేస్తారో మరో రెండురోజుల్లో తేలనుంది. గత పది నుంచి పదిహేనేండ్లు యాదగిరిగుట్ట దేవస్థానంలోనే విధులు నిర్వర్తిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఉద్యోగులను ఇతర దేవాలయాలకు బదిలీ చేయాల్సిందేనని స్థానికుల నుంచి డిమాండ్ ఉంది.

## బ్రాండెడ్ పేరుతో నకిలీ సరుకుల విక్రయం!

- నల్లగొండలో కాపీ రైట్స్ అధికారుల తనిఖీ



కిరాణ దుకాణం తనిఖీ చేస్తున్న అధికారులు

నీలగిరి, జూలై 24 : నల్లగొండ పట్టణంలోని పలు దుకాణాల్లో బుధవారం కాపీ రైట్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ప్రజలకు బ్రాండెడ్ పేరుతో నాణ్యతా లేని విద్యుత్ వైర్లు అమ్ముతున్న నిర్వాహకులపై కాపీరైట్స్ ముంబై అధికారులు, వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేశారు. ప్రకాశం బజార్‌లోని హనుమాన్ ఎలక్ట్రికల్ దుకాణంలో నిర్వాహకులు గోల్డ్ మెడల్ కంపెనీ పేరు చెప్పి నాణ్యతాలేని కరెంటు వైర్లు అమ్ముతున్నట్లు అందిన సమాచారంతో సోదాలు చేసి దాదాపు రూ.22 లక్షల విలువైన 16 వైర్ల బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పట్టణంలోని షేర్‌బంగ్లాలో పద్మావతీ కిరాణం జనరల్ స్టోర్‌లో స్టీవ్‌వెల్ కంపెనీ పేరుతో నకిలీ అగర్‌బత్తులు దాదాపు 1.21 లక్షల విలువైన ఏడు బాక్స్‌లను స్వాధీనం చేసుకొని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. అనంతరం వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నాణ్యత లేని వస్తువులను ప్రజలకు హానీ కలిగించే వస్తువులను అమ్ముతున్న మదన్, శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐపీ ఇన్వెస్టిగేషన్ అధికారి ఇజ్రార్, ఎస్ఐలు సందీప్‌రెడ్డి, శంకర్, కాపీరైట్ అధికారులు ఇక్బాల్ ఖద్రి, దినేశ్ శెట్టి, సంతోష్, దీపక్ ఉన్నారు.